# లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

❑ జిల్లా చైర్మన్, ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి రాజేశ్‌బాబు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజేశ్‌బాబు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 8: జాతీయ లోక్ అదాలత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్, ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ సెషన్ న్యాయమూర్తి రాజేశ్‌బాబు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రధాన న్యాయస్థానం కోర్టుహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30న జిల్లా కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని, వివిధ కేసులు ఉన్న వ్యక్తులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జిల్లాలో 6,549 సివిల్ కేసులు ఉన్నాయని, అలాగే 7,554 క్రిమినల్ కేసులు, 193 నాన్ బెయిలబుల్ కేసులు ఉన్నాయని, వీరంతా వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే 114 ఐపీఎస్, 27 ఎక్సైజ్ కేసులు 48 చెక్ బౌన్స్ కేసులు నమోదయ్యాయని, కేసులుంటే ఉద్యోగానికి ఆటంకంగా మారుతుందని, జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. జిల్లాకోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టుల వరకు వెళ్లడం వల్ల సమయంతో పాటు డబ్బు కోల్పోవలసి ఉంటుందని చెప్పారు. ఇదే కార్యక్రమంలో సెక్రటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయమూర్తిని జి.సబిత మాట్లాడుతూ వివిధ సందర్భాలలో కేసులు నమోదైన వాళ్లు వెంటనే రాజీపడి, జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు లేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి పి. మౌనిక, ఏపీఆర్‌వో కొట్ల తిరుపతయ్య, అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, డీఎస్పీలు మోహన్ కుమార్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

## గువ్వలను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



గువ్వల బాలరాజును కలిసిన సాయినగర్‌వాసులు

అచ్చంపేట, డిసెంబర్ 8: ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజును ఆ పార్టీ శ్రేణులు భారీగా వెళ్లి కలుస్తున్నారు. ఐదు రోజులుగా అచ్చంపేట నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి కలుస్తున్నారు. ఓటమికి గల కారణాలు విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ కక్షపూరిత చర్యలకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, న్యాయబద్ధంగా ఎదుర్కొందామని గువ్వల కార్యకర్తలకు భరోసా ఇస్తున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ఉప్పునుంతల, డిసెంబర్ 8: ఉప్పునుంతల సింగిల్‌విండో ఆధ్వర్యంలో రైతుల ప్రయోజనాల కోసం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విండో సీఈవో రవీందర్ రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉప్పునుంతల, మొల్గర, కొరటికల్‌లో విక్రయాలు జరుగుతాయని తెలిపారు. రైతులు అందుబాటులో ఉన్న కేంద్రాల్లో రైతులు వరి ధాన్యం విక్రయించవచ్చని పేర్కొన్నారు.

## మినుము పంట పరిశీలన

లింగాల, డిసెంబర్ 8: యాసంగిలో సాగు చేసిన మినుము పంటలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి నాగార్జున రెడ్డి పరిశీలించారు. ప్రస్తుతం మారుతున్న వాతావరణం దృష్ట్యా చీడపీడలు ఆశించి, నష్టపరుస్తాయన్నారు. వేరుశగన పంటకు లద్దె పురుగు ఆశిస్తుందని, పంట సంరక్షణకు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను రైతులు పాటించి మందు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

## భక్తిశ్రద్ధలతో పుష్పయాగం

బిజినపల్లి, డిసెంబర్ 8 : మండలంలోని వట్టెంలో వెలిసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో పుష్పయాగాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మనోహర్‌రెడ్డి, వసుంధర దంపతుల సహకారంతో నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు ప్రత్యేక పూజ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, చంద్రారెడ్డి, నరసింహారెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## నల్లబెల్లం లారీ పట్టివేత : కేసు నమోదు

అచ్చంపేట, డిసెంబర్ 8: ప్రభుత్వం, అధికారులు అక్రమ బెల్లం దందాను కట్టడి చేసేందుకు ఎంత కఠినంగా వ్యవహరించినా అక్రమార్కులు తమ దందాను మాత్రం ఆపడంలేదు. గ్రామాల్లో కొందరు ముఠాగా ఏర్పడి ఆటోలు, జీపులు, లారీల్లో బెల్లం తరలిస్తున్నారు. గురువారం రాత్రి బల్మూర్ మండలం జీన్‌కుంట వద్ద అక్రమంగా నల్లబెల్లంతో లారీ వెళ్తుండగా అచ్చంపేట ఎక్సైజ్ అధికారులు నిఘా పెట్టి పట్టుకున్నారు. లారీలో 200 బ్యాగుల నల్లబెల్లంతో పాటు 250 కేజీల పట్టిక ఉన్నట్లు అచ్చంపేట ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య తెలిపారు. ముందస్తు సమాచారం రావడంతో నిఘా ఉంచి పట్టుకున్నట్లు తెలిపారు.

## మొక్కలు ఎండిపోకుండా చూడాలి

తాడూరు, డిసెంబర్ 8 : మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో గంగామోహన్ అన్నారు. మండలంలోని గుంతకోడూరు, అల్లాపూర్, మేడిపూర్, ఆకునెల్లికుదురు గ్రామాల్లో నర్సరీలను శుక్రవారం సందర్శించారు.

## రేపు సోమశిల నందీశ్వరుడికి రుద్రాభిషేకం

కొల్లాపూర్ రూరల్, డిసెంబర్ 8: మండలంలోని సోమశిలలో గల లలితాసోమేశ్వర ఆలయంలో ఆదివారం ప్రముఖ ప్రవచనకర్త, విద్యాగణపతి పీఠం శ్రవణ్ కుమార్‌శర్మ పర్యవేక్షణలో నందీశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోవింద్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

## శ్రీశైల దేవస్థానానికి విరాళాలు

శ్రీశైలం, డిసెంబర్ 8: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన ప్రసాద వితరణ పథకానికి జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన బి.వెంకటేశ్వరరెడ్డి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. శుక్రవారం ఏఈవో ఫణిదర్‌ప్రసాద్, పర్యవేక్షకులు మధుసూదన్‌రెడ్డికి విరాళాన్ని చెక్కు రూపంలో అందించగా దాతలకు శ్రీభ్రమరాంబికా మల్లికార్జున స్వామి దర్శనాన్ని కల్పించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు, జ్ఞాపిక పత్రాన్ని అందజేసి సత్కరించారు.

# విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

● డీఈవో గోవిందరాజులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో గోవిందరాజులు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 8: విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తూ వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని డీఈవో గోవిందరాజులు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమీక్షా సమావేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిక్షణ ద్వారా స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌ను ప్రతి ఉపాధ్యాయుడు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థి వారీగా ప్రారంభ పరీక్ష గ్రేడ్‌లు అప్‌లోడ్ చేసి ప్రతినెలా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, ప్రగతిని యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. బోధన విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫేషియల్ రికగ్నేషన్ హాజరు వ్యవస్థ ద్వారా విద్యార్థుల హాజరుశాతాన్ని నమోదు చేయాలన్నారు. సెక్టర్ల అధికారి షర్పుద్దీన్, హెడ్మాస్టర్ సిద్ధిక్ హుస్సేన్, స్ట్రాంగ్ టీచర్ వెంకటేశ్వర శెట్టి ఉన్నారు.

## నేటి నుంచి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబర్ 8 : ప్రభుత్వ మహిళలకు ఉచిత ప్రయాణం శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభిస్తారని డిపో మేనేజర్ దేవరాజు ప్రకటనలో తెలిపారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లో మాత్రమే సౌకర్యం ఉంటుందన్నారు. ఓటర్ ఐడీకార్డు గానీ ఆధార్‌కార్డు చూపాలని పేర్కొన్నారు.

## ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాం

కడ్తాల్, డిసెంబర్ 8 : మండలంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన మహ్మద్‌షబ్బీర్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు శుక్రవారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు తరపున రూ.5వేలు, వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.10వేలు, సర్పంచ్ రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి గ్రామాధ్యక్షుడు నర్సింహ, నాయకులు పాల్గొన్నారు

## పారిశుధ్య పనులకు సహకరించాలి

కడ్తాల్, డిసెంబర్ 8 : గ్రామ పంచాయతీలో చేపట్టే పారిశుధ్య పనులకు ప్రతిఒక్కరూ సహకరించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారితోపాటు పలు కాలనీల్లో పారిశుధ్య సిబ్బంది చేపట్టిన పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అదేవిధంగా సకాలంలో ఇంటి పన్నుల చెల్లించి గ్రామాభివృద్ధిలో తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ దవాఖాన సీజ్

అచ్చంపేట టౌన్, డిసెంబర్ 8: అచ్చంపేట పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా చరిత సాయి దవాఖాన కొనసాగిస్తున్నారని, జిల్లా వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి సీజ్ చేశారని డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్ తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవికుమార్, డెమో అధికారి నర్సింహ తనిఖీ నిర్వహించారని, దవాఖాన రిజిస్ట్రేషన్ 2022 వరకు మాత్రమే ఉందని, అనంతరం దీనిని రెన్యువల్ ఇన్‌టైమ్‌లో చేయించలేదని, దవాఖానలో విధులు సక్రమంగా నిర్వర్తించడంలేదని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు సమయపాలన పాటించాలి

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 8: ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న వైద్యులు సమయపాలన పాటించాలని జిల్లా టీకాల వైద్యాధికారి రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వంద పడకల దవాఖానలో చిన్న పిల్లల పర్యవేక్షణ కార్యాలయాన్ని తనిఖీ చేసి, విధుల్లో ఉన్న వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. పుట్టిన పిల్లలకు 24 గంటలలోపు ఇవ్వాల్సిన టీకాలు కచ్చితంగా ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి అశోక్ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెడ్ నర్స్ మాణిక్యమ్మ, పాషా తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల తనిఖీ

పాన్‌గల్, డిసెంబర్ 8: మండలంలోని దవాజీపల్లి, మాందాపూర్, కొత్తపేట ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, చదువుతో వెనుకబడిన విద్యార్థులపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించి, వారి విద్యాసామర్థ్యాలు పెంపొందించాలని కోరారు.

## లోక్ అదాలత్ సన్నాహక సమావేశం

కొల్లాపూర్, డిసెంబర్ 8: ఈనెల 30న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని 11వ తేదీన సాయంత్రం 4గంటలకు కొల్లాపూర్ కోర్టులో లోక్ అదాలత్ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఆర్వీఎస్ఎస్ మిథున్‌తేజ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కేసుల పరిష్కారంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా మహాపడి పూజ

కడ్తాల్, డిసెంబర్ 8 : మండల కేంద్రంలో శుక్రవారం గురుస్వాములు ముకుందం, లక్ష్మయ్య, ఆనంద్, సైదులు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. భక్తుల అయ్యప్ప శరణుఘోషతో గ్రామం మార్మోగింది. ఈ సందర్భంగా ఎల్ఎన్ లక్ష్మయ్య దంపతులు భిక్ష అందజేశారు.

## కేసీఆర్ కోలుకోవాలని పూజలు



శివపూజ చేస్తున్న శివస్వాములు

కల్వకుర్తి, డిసెంబర్ 8: ప్రమాదవశాత్తు గాయపడ్డ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకొని శుక్రవారం పట్టణంలో శివస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. తొందరగా కోలుకుని నిండూ నూరేండ్లు జీవించాలని కోరుకుంటూ శివస్వాములు తమ సన్నిదానంలో పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి ఆనంద్‌గౌడ్, శివస్వాములు ఉన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

బిజినేపల్లి, డిసెంబర్ 8: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్వర్గీయ చంద్రమౌళి, సాయిప్రకాశ్ జ్ఞాపకార్థం వారి కుమారులు సురేశ్, రాంప్రకాశ్, చరణ్ శుక్రవారం తెలుగు, ఇంగ్లిష్, హిందీ పుస్తకాలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. పాఠశాలలో గ్రంథాలయానికి పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. హెచ్ఎం రాములునాయక్ మాట్లాడుతూ మంచి మనసుతో పేద విద్యార్థులకు సాయం అందించడం గొప్పవిషయమన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

కొల్లాపూర్, డిసెంబర్ 8: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని మండల విద్యాధికారి చంద్రుడునాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం కొల్లాపూర్ బాలికల ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎల్లూరు జెడ్పీ హైస్కూల్‌లోనూ, కొల్లాపూర్ గాంధీ హైస్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ పట్టణంలోని ఆర్ఐడీ పాఠశాలలో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్స్‌ను వాడి, విద్యార్థుల హాజరుశాతాన్ని, విద్యా ప్రమాణాలు పెంచాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు ఎంఈవోను శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు.

## రికార్డులను పరిశీలించిన ప్యానెల్ బృందం

లింగాల, డిసెంబర్ 8: స్థానిక కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ, జీసీడీవో ఆదేశాల మేరకు శుక్రవారం సూర్యచైతన్య ఆధ్వర్యంలో ప్యానెల్ బృందం సభ్యులు అంబట్‌పల్లి, లింగాల ఉన్నత పాఠశాల హెచ్ఎంలు తహేర్‌పాషా, శేఖర్ సందర్శించారు. తరగతి గదులు, విద్యార్థుల హాజరుశాతాన్ని, మరుగుదొడ్లు పరిశీలించారు.

## శ్రీశైలంలో శుక్రవార పూజలు

శ్రీశైలం, డిసెంబర్ 8: శ్రీశైల మహా క్షేత్రంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిపిస్తున్నట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం గ్రామదేవత అంకాలమ్మకు వార పూజల్లో భాగంగా అభిషేకాలు, విశేషార్చనలు జరిపించారు. సాయంత్రం భ్రమరాంబ అమ్మవారికి క్రతువులు నిర్వహించారు.